# మంత్ర కవాటం



వివాహానికి పూర్వం ప్రతియువకుడూ భవిష్యత్తు గురించీ రాబోయే భార్య గురించీ బంగారు కలలు కనటం సహజం. ఆమె ఎస్మరాల్డ, ఊర్వశి, సలోమి, పౌలోమి. వారిద్దరి బ్రతుకూ మహాకవి చెప్పినట్లుగా ఒక తియ్యని సుందర స్వప్నంవలె గడిచి పోతుంది. ఇక వెన్నెల రాత్రుళ్లు సుఖంగా గడపవచ్చు. రాధికాదేవి తెల్లచీరవలె బొండుమల్లియపూలవలె, వెల్తురువానవలె ధాత్రిమీద పరచుకొనివున్న వెన్నెలలో వాళ్లిద్దరూ ఆడుకుంటారు, పాడుకుంటారు. ఈ విధంగా మస్తిష్కపు మారుమూలల్లో కూడ సుమధురమైన ఆలోచనా స్రవంతి.

విశాలవిశ్వంలోని అనంత కోటి ఆఫీసుల్లో కోట్లకొలది గుమస్తాలలో ఒకడైన వెంకట సుబ్రమణ్యం కూడా పైవిధంగా ఆలోచించాడనడం సాహసం కానేరదు. పెళ్ళి అయిన తరువాత ఆమనిషి ఏతదూహాలన్నీ ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. సంసారనౌక ఒడుదొడుకులు లేకుండా సాఫీగా వెళ్లాలంటే తాను సాధ్యమైనంతవరకు ధర్మపత్నికి సహాయం చెయ్యాలనుకున్నాడు.

అంచాత ఉదయసూర్యుని సప్తహాయములూ పరుగు మొదలెట్టడం ఆరంభించకముందే అతను లేస్తాడు. కాఫీకుంపటిలో బొగ్గులు వేసి దానిమీద గిన్నెతో నీళ్లు పెట్టి, పెరట్లోకి వెళ్ళి దంతధావనం మొదలుపెడ్తాడు. తత్కార్యక్రమం ముగించేటప్పటికి కాఫీనీళ్లు మరుగుతాయి. కాఫీ కలిపి రాజమ్మను లేపుతాడు. ఆమె బద్ధకంగా మెటికలు విరుస్తూ ఒయ్యారంగా లేస్తుంది.

ముఖం కడుక్కొని బద్ధకంగా కాఫీ తాగేసి ఏమిటో ఆలోచిస్తూ మళ్ళీ మత్తుగా కూర్చుండిపోతుంది. ఈ మహానగరంలో వాళ్ళిద్దరికీ పనిమనిషి ఎక్కడనుండి వస్తుంది. కాబట్టి వెంకట సుబ్రమణ్యం గిన్నెలన్నీ ధగధగా మెరిసేటట్టు తోమేసి, తనబట్టలూ శ్రీమతి బట్టలూ ఉతికేసి' గదులురెండూ వూడ్చేసి సగర్వంగా ఆమెవైపు రాజపుత్రవీరుడిలా చూస్తాడు. భర్త ప్రేమకు కృతజ్ఞతాసూచకంగా ఆమె ఎర్రని పెదిమలపై కొంకచిరునవ్వురేఖ ప్రాకుతుంది. వంటకూడా చెయ్యడానికి ఆ మానవుడికి అభ్యంతరం లేదుగాని, పాపం సతీమణికి జాలివేసి ఆ పనికి మాత్రం ఒప్పుకోలేదు.

ఆఫీసుకు వెళ్తూవుంటే వెంకట సుబ్రమణ్యం నరాలన్నీ పీకుతవి. ఈ వజ్రాన్ని, ఈ సౌగంధిక కమలాన్ని ఇట్లా వదిలేసి వెళ్ళిపోవటమే! ఒక్కత్తే ఈ గదిలో ఎట్లా కాలాన్ని గడుపుతుంది అనుకుంటాడు. అతని మెదడులో సెందురుని చూసిన గభీరసాగర కల్లోలాలు. రక్తంలో నయాగరా శివసముద్ర జలపాతాలు.

ఆఫీసుకు దేవుడా అంటూ వెళ్తాడు. ఆది నరకం. హెడ్ గుమస్తా యముడు. ఎప్పుడు విమోచన మన్నట్లుగా, ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఫీలయి వెంకటసుబ్రమణ్యం గడియారం

★ గోపాల చక్రవర్తి ★

కేసి చూస్తూ కూర్చుంటాడు. చుట్టూవున్న తోటి గుమాస్తాలు గబగబా పనిచేస్తూవుంటారు దించిన తల ఎత్తకుండా. సుదూరంలో వున్న ఇద్దరు టైపిస్టులూ ఫాక్టరీ పొగగొట్టపుధ్వని ఉత్పత్తి చేస్తున్నారు.

—ఎందు కింత నెమ్మదిగా తిరుగుతుంది ఈ గడియారం ముల్లు? జటాక్కాగుర్రానికి తనకూ తేడా ఏమిటి? రాజమ్మ ఏం చేస్తున్నదో. ఒంటరిగా, పాపం, ఈ లేత వయస్సులో, ఈ మహానగరంలో వెధవగదిలో ఉండడం ఎంతకష్టం!

చీకటీ దుఃఖం, కరువూ కాటకం లేనిదేశంలో, సదా అమృతం వెల్తురూ వున్న దేశంలో ఎర్రని చిక్కని పానీయం తాగుతూ ఏ రాజకుమారుడితోనో ఉండాల్సిన అందాల రాణి. తొల్లిటిజన్మలో ఏశాపంవలన ఏ గంధర్వరాణి తన భార్య అయిందో!

గడియారం ముల్లు సెకన్లనూ, నిమిషాలనూ, గంటలనూ దాటిపోతుంది, భూగోళ తీవ్ర పరిభ్రమణం. మిగతా గుమస్తాలు ఇంకా తీవ్రంగా పని చేస్తూ వుంటారు. ఇంకా టైపిస్టుల ఫ్యాక్టరీ పొగగొట్టపు ధ్వనులు. అయిదు గంట లవుతుంది. అమ్మయ్య అనుకుని వెంకటసుబ్రమణ్యం కుర్చీలో నుంచి దూకుడుగా లేస్తాడు. రోడ్డుమీద పెద్ద అంగలతో రెడార్మీ యోధుడివలె నడక. అతని కంటికి బాటమీద ఏ వస్తువూ కనిపించదు. ఒకటే నడక. దూరాన కొత్తప్రపంచపు పునాదులు కన్పిస్తాయి.

ఇల్లు చేరుకుని 'రాజా' అని తలుపు కొట్టాడు. మంత్రకవాటం తెరుచుకొని ముస్తాబయిన రాజమ్మ దర్శనమిస్తుంది. ఫరవా లేదు. మొగల్ రాణి, రతీదేవి కులాసాగానే వుంది. ఇద్దరూ తర్వాత బీచికి వెళ్తారు. అర్థణా టిక్కెట్టు శాంతోమ్ ట్రా మెక్కడం రాజమ్మకు సరదా. వెంకటసుబ్రమణ్యం అంచాత రోజూ శాంతోమ్ బీచికే తీసుకొని వెళ్తాడు. జనానికి దూరంగా చీకట్లో కూర్చుంటారు-అనంతమైన తరంగాలతో అగాధమైన సముద్రాన్ని, శచీదేవి చీరలోని తళుకుల్లా మెరిసే నక్షత్రాల్ని చూస్తూ.

ఎనిమిదిన్నరకు ఇంటికి వస్తారు. బడలికతో ఆమె అలసిపోతుంది. వెంకటసుబ్రమణ్యమే కంచాలూ పీటలూ వేసి వడ్డించి ఆమెను భోజనానికి రమ్మంటాడు........ఆఫీసు నుంచి వస్తున్నాడు వెంకటసుబ్రమణ్యం. ఇవాళ అతన్ని "నీకెంతమంది పిల్లలు అబ్బాయీ" అని అడిగాడు హెడ్‌గుమస్తా. అయితే తన కెప్పుడు పుట్టారో పిల్లలు...ఎంతమంది? జ్యోతిష్కునిఎందు కడగకూడదు? చటుక్కున అతను అనుకున్నాడు. సరాసరి జ్యోతిషాలయానికి వెళ్లాడు. అతని వైవాహిక జీవితంలో ఆఫీసు నుండి ఇంటికి ఎప్పుడూ ఆలస్యంగా వెళ్ళలేదు. ఇదే ప్రథమం. రాజమ్మ ఏమనుకుంటుందో. కోపగిస్తుందేమో.

ఎస్ట్రాలజర్ శంకరయ్యరు వెంకట సుబ్రమణ్యానికి చాలా గౌరవం చేశాడు. "మీకు కొద్ది రోజుల్లో జీతం ఎక్కువవుతుంది. జీవితంలో చాలా పెద్ద ఉద్యోగంలోకి వచ్చే ఛాన్సు వుంది..." ఏమిటేమిటో చెప్పుకుపోతున్నాడు శంకరయ్యరు.

"కాని......"

"ఏమిటి" తొందరగా వెంకట సుబ్రమణ్యం ప్రశ్నించాడు.

"మీ వైవాహికజీవితం సాఫీగా వుండదు"

వెంకటసుబ్రమణ్యానికి అర్థంకాలేదు. రెండేళ్ల బట్టి తనూ రాజమ్మా ఎంత అన్యోన్యంగా వుంటున్నారు! ఇలా అంటాడేమిటి ఈయన?

"కాస్త విడమర్చి చెప్పండి" అన్నాడు తను.

"మీ రేమీ అనుకోరాదు- నిజం చెప్తున్నా. ఇంకో ఆరునెలల్లో మీ ఆవిడ లేచిపోతుంది—"

వెంకటసుబ్రమణ్యం రైలు క్రింద పడిపోయాడు. న్యూయార్కు ఆకాశచుంబిత భవనంలోంచి క్రిందకు దూకేశాడు. అట్లాంటిక్ సముద్రపు కెరటాలు అతన్ని కబళించివేశాయి. అతని గుండె ధామ్మని పేలిపోయింది. సాలెపురుగు బొద్దింకను పట్టుకుంది.

ఉచ్చైశ్రవంలా లోనికి వెళ్లినవాడు గాడిదలా యివతలికి వచ్చాడు. రాజమ్మ లేచిపోతుందా... తన వజ్రాన్ని ఎవరో తీసుకుంటారా....

ఇల్లు చేరుకునేటప్పటికి అతడు జీవచ్ఛవం. ఆరంగుళాల మనిషి.

"ఏం అలా వున్నారేం" అని అడిగింది ప్రేయసి.

ఈ అప్సరసను, ఈ శ్వేతద్వీపపు ఏకరాణిని ఎత్తుకపోతారా...ఎవరు?

"ఏం లేదు. ఒంట్లో బాగాలేదు" అన్నాడు. అబద్ధ మాడకుండా వుండడానికి ఆఫీసు గుమాస్తా హరిశ్చంద్రుడు కాడు.

వెంకటసుబ్రమణ్యానికి ఆరోజురాత్రి జ్వరం వచ్చింది. తీవ్రమైన జ్వరం జ్వరంలో పిచ్చి పేలాపనలు. అవేమీ రాజమ్మకు అర్థంకాలేదు. కాని వారంరోజుల పిదప జ్వరం తగ్గిన తర వాత ఒకసుప్రభాతాన అతన్ని ప్రశ్నించింది. "మిమ్మల్ని ఏదోసమస్య కలవర పెట్తున్నది. ఎందుకీ అశాంతి? ఏమిటా బాధ నాకు చెప్పరూ" అన్నది.

వెంకట సుబ్రమణ్యం నిశ్చలంగా మైలు రాయిలా, గౌతమ బుద్ధుడిలా కూర్చున్నాడు. ఆమె చెప్పమని ప్రాధేయపడింది.

"చెప్పమంటావా"

"చెప్పండి"

'ఆరునెలల తర్వాత నువ్వు నాదానివి కావు.' అతను వెక్కి-వెక్కి-ఏడ్వడం మొదలుపెట్టాడు. రాజమ్మకు ఆవాక్యం ఐన్‌స్టైన్‌కల్లు. డార్విన్ గడ్డం.

జరిగినకథంతా ఏడుస్తూ నెమ్మదిగా ఆమెకు వినిపించాడు వెంకట సుబ్రమణ్యం. ఆమె కను కొలకుల్లో మంచుబిందువులవంటి అశ్రుకణాలు.

"ఇంతేనా నాథా, ఏ పెనుశక్తీ మనిద్దర్నీ విడతీయ లేదు. జీవితపు జడివానల్లో, పెనుతుపానుల్లో కూడా మనం ఏకమై నిల్చుంటాం."......... పురాణకాలపు సావిత్రీ, అరుంధతీ, అనసూయా ఆమె వాక్కులో వున్నారు. అతని మొహంలో వేయి సెర్చిలైట్ల కాంతి.

ఆరునెలలు గడిచాయి-నూట ఎనభై రెండు రోజులు, నాలుగువేల మూడువందల అరవై ఎనిమిది గంటలు.

రాజమ్మ ఏమైంది? వెంకటసుబ్రమణ్యం రాజమ్మా దాంపత్యజీవితంఎట్లా వుంది? రాజమ్మ లేచిపోయింది. ఎదురింటి గదిలో వుంటున్న రాడీతో లేచిపోయింది. అత డామెకాధ్యాత్మిక బంధు వైపోయాడు. అంచాత ఈ మహాప్రేమి కుణ్ణి విడిచి అతని దగ్గరకు వెళ్ళిపోయింది. భూకం పం వస్తుందని సేస్మోగ్రాఫ్‌కు తెలుసు. ఇంత హఠాత్తుగా పెళ్ళాం కన్పించదని వెంకట సుబ్రమణ్యానికి తెలియదు. ఎందుకు లేచి పోయింది? వెంకట సుబ్రమణ్యం చెప్పినందు వల్లనా? పాపం, ఫ్రాయిడ్ పేరు అతను జీవితంలో వినలేదు. వింటే ఆమెకు నువ్వు లేచిపోతావుట అని చెప్పేవాడు కాదేమో!

ఏమైనా కలియుగాంతం ఇంతతొందరగా వొస్తుందని వెంకట సుబ్రమణ్యం ఎప్పుడూ అను కోలేదు.

పంతులు:- (కోపంగా) టేబిలుమీద ఈ వాడిపోయిన పువ్వులు ఏ వెధవ పెట్టాడు?

నౌకరు:- (వినయంగా) చిత్తం, అమ్మగారండి!

పంతులు:-[తీసి వాసనచూస్తూ] ఎంతసువాసన!

* * *

హిమాలయాలు చాలా ఉన్నతమైనవే గాని కొన్ని విష యాలను వాటితో పోల్చడం తప్పు. హిమాలయ పర్వతమంత అభిమానం గాని, ప్రేమ గాని, ధనం గాని ఎప్పుడూ మంచుకొమల్లే కరిగి, నీళ్లు కారిపోతాయి!